


(న్యూజెర్సీ కథల పోటీలో 150 రూపాయిలు బహుమతిగా అందుకున్న కథ)

# కరెక్ట్ అడ్రస్




సమయం ఐదు గంటలయింది. హుషారుగా విజిల్ వేసుకుంటూ ఆఫీస్‌లోనుంచి బయటపడ్డాను. జీతాల రోజు. జేబు బరువుగా వుంది. జీతం పదిహేను వందలముప్పయి డ్రాచేసి, జేబులో పెట్టుకొనేప్పటికి అంతులేనంత ఆశావాదం, అంతకు మించిన ఆత్మవిశ్వాసం వచ్చేశాయి. అయినా ఒక ప్రక్క కొంచెం దిగులుగానే వుంది. సుమతి ఊళ్ళో వుంటే నాకు కావాల్సిన డబ్బు వుంచుకొని, మిగతాది తన చేతిలో పడేస్తే తన తంటాలు తను పడ్తూ ఇల్లు జరుపుకొచ్చేది. సుమతి నా భార్య. ప్రస్తుతం పుట్టింటికి వెళ్ళింది.

అలవాటుగా కాళ్ళు బస్ స్టాప్ వైపు నడుస్తున్నాయి. అయినా, ఇప్పుడే ఇంటికి వెళ్ళి చేసేదేముంది? ఒక్కన్నే ఇంట్లో ఏ పుస్తకాలో చదువుకుంటూ కూచోవాలి. నడుస్తూపోతే కాలక్షేపం, కాళ్ళకి పని, డబ్బు మిగులు అన్నీ కలిపి వస్తాయి. గుడ్ ఐడియా. నాలుగు అడుగులు వేశానో లేదో కళ్ళు జిగేల్మన్నాయి. నిగనిగలాడుతూ ఎదురుగా నల్లటి పర్సు. గబుక్కున జేబులో కుక్కాను. గుండెలు దడదడమంటున్నాయి. నన్నెవరన్నా గమనించారేమోనని చుట్టుపక్కల చూశాను. ఎవరి గొడవలో వాళ్ళున్నారు. ఎవ్వరూ నన్ను చూడలేదు. అమ్మయ్య! దీర్ఘంగా ఊపిరి విడిచి అడుగు ముందు కేశాను. ఇంతమంది జనం తిరుగుతున్న ప్రదేశంలో దొరికిందంటే, బహుశా ఇప్పుడే ఆ పర్సు పడిపోయి వుంటుంది. ఆ పర్సు పోగొట్టుకున్న అతను మళ్ళీ వెనక్కి వస్తాడేమో? అతని పర్సు అతనికిచ్చేస్తే? ఒక్క క్షణం ఆలోచన. స్వార్థం ఆలోచనను అణచివేసింది. నాకు దొరికిందంటే ఇక అది నా పర్సు. వాడెవడి కోసమో చూసి, వాడికి ఇది ఇచ్చి, వాడితో భేష్ అనిపించుకోవాలా ఏమిటి? ఇంతలో ఉత్సుకత, అసలు పర్సులో ఏముందో? గబ, గబా పక్క వీథిలోకి నడిచాను. జనం లేనిచోట ఆగి పర్సు బయటకు తీశాను. చేతులు విపరీతంగా వణుకుతున్నాయి. ఎందుకు? పర్సులో ఏముందో అన్న టెన్షన్ కారణంగానా? లేక ఎవరి పర్సునో నేను స్వంతం చేసుకుంటున్నందుకా? అయినా నా కెందుకు భయం? నేనేమన్నా దొంగతనం చేశానా? కాకుంటే, నేను పర్సును దొరికిన చోటనే చూడకుండా, ఈ జనంలేని చోటికి ఎందుకు వచ్చాను? పర్సు తెరవడానికి కూడా ఎందుకు భయపడుతున్నాను? నేను గిల్టీగా ఫీలవుతున్నానా? ఆలోచనలు ఆపేసి పర్సు తెరచి చూశాను. ఐదు వంద రూపాయి నోట్లు, ఒక ఇన్‌లాండ్ కవర్ వున్నాయి. పర్సు రెండో వైపున అడ్రస్ వ్రాసిన కార్డు వుంది. ఐదు వందల రూపాయిలు. అంతవరకు మెదుల్తున్న అపరాధ భావం నాలోంచి జారుకుంది. ఐదు వందలంటే చిన్న మొత్తమా? దీనిని తీసుకుపోయి అతనికిచ్చేస్తే, ఏం వస్తుంది? అతను కృతజ్ఞతలు చెప్తాడు. మహా అయితే ఒక కాఫీ ఇస్తాడు. తర్వాత మామూలే. కథ కంచికి, నేను ఇంటికి. అలా కాక పర్సు నా దగ్గర వుంచుకుంటే, ఐదు వందలు నా స్వంతమవుతాయి. నా ఫ్రెండ్స్ అందరూ మందు పార్టీ ఇమ్మని ఎప్పటి నుంచో గోల చేస్తున్నారు. వాళ్ళకి మంచి పార్టీ ఇవ్వచ్చు. లేదంటే సుమతికి, నాకి మంచి బట్టలు కొనుక్కోవచ్చు. అదీ కాకపోతే మామిద్దరూ రెండు రోజులు హాయిగా ఎక్కడన్నా తిరిగి రావచ్చు. సిరి తానంతట తాను వస్తుంటే మోకాలు ఎవరు అడ్డం పెడతారు? ఐదు వందల లాభాన్ని ఎందుకు వదులుకోవాలి? అంతే, మళ్ళీ నడక ప్రారంభించాను. అయినా, ఈ పర్సులు ఎవ్వడు కనిపెట్టాడో? నా వరకు నాకు పర్సు పెట్టుకోవడం అలవాటు లేదు. ఇదిగో, ఇదే నా జీవితంలో మొట్టమొదటిసారి. మళ్ళీ ఆగి పై జేబులో వున్న పదిహేను వందలు తీసి పర్సులో సర్ది, మళ్ళీ నడవడం ప్రారంభించాను. ఇప్పుడు ప్రాణానికి హాయిగా వుంది. విజిల్ వేస్తూ మెయిన్ రోడ్డు మీదకు వచ్చాను. ఇంత మంచిరోజు ఫస్ట్ షోకి మంచి సినిమాకి పోతే ఎలా వుంటుంది! కానీ, ఇంటికి వెళ్ళి స్నానం చేసి బయలుదేరాలి. "ఆటో!" ఆటోని పిల్చాను. కనీసం బేరమయినా ఆడక్కుండా అడ్రస్ చెప్తూ ఎక్కి కూర్చున్నాను. మరి అయిదు వందలా, మజాకానా? ఆటో రయ్యిన దూసుకుపోయింది. స్టైల్‌గా ఆటో దిగి, జేబులో నుంచి పది రూపాయిలు తీసి ఇచ్చి లోపలకు నడిచాను. ఇంట్లోకి పోయానో, లేదో ఫ్లాష్ ఓవర్. దిగిపోయాడు అద్దె అంటూ. నేనెప్పుడు వస్తానా అని ఎదురుచూస్తున్నాడేమో? పర్సు కోసం పాంట్ జేబులో చేయి పెట్టాను. లేదు. పర్సు లేదు. పర్సు పోయింది. గుండె ఆగిపోయింది. ఎక్కడ పడిపోయి వుంటుంది? గుండెల్లో నుంచి కళ్ళలోకి నీళ్ళు పొంగుకొచ్చాయి. ఈ వేళ ఏం చేయాలి? చీకట్లు కమ్ముకువస్తున్నాయి. ఏం చేయాలో తోచడం లేదు. ఇరవై రెండు వందల



నష్టం. కాస్త, కూస్త. ఎవరికన్నా దొరికితే తెచ్చిస్తారేమో? పోనీ నేను బయటకు వెళ్ళి వెదికితే?

బయలుదేరపోతుంటే ఎవరో సార్ అని పిల్చారు. రైట్ వేశాను. ఇందాకటి ఆటో డ్రైవర్. "మీ పర్సు ఆటోలో పడిపోయిందండీ, ఇద్దామని తీసుకొచ్చాను" అతను దేవుడిలా కన్పించాడు. పర్సు గబుక్కున తీసుకుని డబ్బు లెక్క పెట్టాను. ఇరవై రెండు వందలు. అక్షరాలా ఇరవై రెండు వందలు. అమ్మయ్య, జీవకళ వెనక్కి వచ్చేసింది. వెంటనే నేను మామూలు మనిషి నయ్యాను. వాస్తవం గుర్తుకొచ్చింది. ఇంతకు ముందు పర్సు దొరికితే తను చేసిన పని ఏమిటి? కేవలం అయిదు వందలకే కక్కుర్తి పడ్డాడు. మరి ఇతను? ఆఫ్టరాల్ ఆటో డ్రైవర్! ఎంత ఉన్నతంగా కన్పిస్తున్నాడు. మనస్సు ఒప్పుకోవడం లేదు. అతన్ని కిందకి దించేయాలి. చాలా మామూలుగా పర్సులోంచి ఓ రెండు వందలు తీసి అతని చేతిలో పెడుతూ "ఇదిగో నీ బహుమతి, ఆఫ్‌కోర్స్ నువ్వు ఇంత ఆశించివుండ వనుకో, నా సంతోషాన్ని ప్రకటించడం కోసం..." అతన్ని ఓ మెట్టు దించడానికి నేను ఓ మెట్టు ఎక్కడానికి చాలా తూచి తూచి మాట్లాడాను. అతను దెబ్బతిన్నట్టు మొహం పెట్టాడు. "నేను మీరేదో బహుమతి ఇస్తారని ఆ డబ్బు వాపసు చేయలేదు. అది మీకు సంబంధించి నది. మీకు చెందాల్సింది. అందుకే తెచ్చిచ్చాను. నాకు డబ్బే కావాలనుకుంటే ఆ మొత్తం నా సొంతమయ్యేది" అతను గిరుక్కున వెనుతిరిగి వెళ్ళిపోయాడు. నాకేం చెయ్యాలో అర్థం కాలేదు. నా ఓటమిని ఒప్పుకోదల్చుకున్నాను. "ఒక్క క్షణం ఆగు. నీ నిజాయితీ నాకు నచ్చింది. సామాన్యంగా చదువు మనిషిలో సంస్కారాన్ని తీసుకొస్తుంది. అటువంటిది నువ్వు చదువుకోకున్నా..." అతను నా మాటలను మధ్యలోనే ఆపు చేశాడు. "నేను పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశాను" నేను విభ్రాంతిపోయాను. "ఇంత చదువుకుని ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నావా?" అతనేమీ మాట్లాడలేదు. చిన్నగా నవ్వి ఊరుకున్నాడు. నేను కావాలనుకుంటే మా కంపెనీలో అతనికి ఏదో ఒక ఉద్యోగం ఇప్పించగలను. ఒక్క క్షణం ఆలోచించి చెప్పాను "రేపు ఒకసారి మా ఆఫీస్‌కి రా. నీకు ఇంతకన్నా మంచి ఉద్యోగం ఇప్పిస్తాను" అతను ఆనందంతో తబ్బిబ్బు అవుతాడనుకున్నాను. చాలా మామూలుగా వున్నాడు. "థాంక్యూ సార్! నేను అదే కావాలనుకుంటే రెండు సంవత్సరాల క్రితమే మంచి ఉద్యోగం మా నాన్నగారి సిఫార్సుతో సంపాదించే వాడిని. కానీ నీతినీ, నిజాయితీనీ నా సుఖం కోసం పణంగా పెట్టాలని నేను అనుకోవడం లేదు."

"కాని దాని కారణంగా మీరు జీవితాంతం కష్టాల్నీ, నష్టాల్నీ భరించాల్సి వస్తుందిగా."


చిన్నగా నవ్వి చెప్పాడు "నేనెప్పుడూ నా నీతినీ, నిజాయితీనీ వ్యాపారంలో పెట్టుబడిగా భావించలేదు, నష్టాన్ని గూర్చి ఆలోచించడానికి. నేను నిజాయితీగా వుండడం నిజాయితీ కోసమే. దాని కారణంగా నేను సుఖాన్ని కోల్పోవచ్చునేమో కాని, సంతృప్తిని సంపాదించుకున్నాను. మీ డబ్బు నాకు దొరికింది. దాన్ని నేను ఖర్చు పెడితే, ఈ నెలంతా సుఖంగా జీవించేవాడిని. కానీ దాని కారణంగా నేను సంతృప్తిని పొందగలనా? ప్రతిక్షణం నేరస్థుడిలా ఫీల్ అవుతూ, నేను హాయిగా వున్నానని నా మనస్సుని నేను మభ్యపుచ్చగలనా?" అతని మాటలు నా మనస్సుని సూటిగా తాకాయి. పర్సు తీసి ఈ సారి అడ్రస్ జాగ్రత్తగా చూశాను. బయటకు నడుస్తూ, అతనితో చెప్పాను. "మనం ఈ అడ్రస్‌కి వెళ్ళాలి."

●

# లోకువ

"ఛీ! ఛీ!! ఇదేం డ్రాఫ్టయ్యా! ఇంత ఛండాలంగా వుంది. అసలు ఎన్నేళ్ళ సర్వీసుంది నీకు! ఇన్నేళ్లయినా ఇంకా డ్రాఫ్టు రాయడం తెలీదటయ్యా నీకు? సరిచేసి పుటప్ చెయ్యి" అంటూ విసిరికొట్టాడు ఆఫీసర్ అప్లాచారి. మొహం మాడ్చుకుని పడిపోయిన ఫైలును తీసుకొని రూంలోంచి బయటకు వచ్చి సీట్లో కూలబడ్డాడు క్లర్కు గోపాలరావ్.

ఎన్నిసార్లు చదివినా తను రాసిన డ్రాఫ్టులో ఏ తప్పూ కనబడడం లేదు. "ఆఫీసర్ కదా, మేమంతా ఏవో పురుగుల్లా కనబడతాం అనుకుంటూ. ఇష్టమొచ్చినట్టు వాగుతాడు. తన ఇ.ఎల్. అంత లేదు వాడి సర్వీసు. హు. పోనీ తప్పు ఎక్కడో చెప్పొచ్చుగా. అసలు వాడికి తెలిస్తే కదా. తనకు చెప్పడానికి" కసిగా తిట్టుకున్నాడు. ఎవర్నయినా కొట్టాలనీ, బాగా తిట్టాలనీ వుంది తనకు. మథన పడిపోయాడు గోపాలరావ్. లంచ్ టైంకు ఇంటికి వెళ్లాడు. బాబిగాడు సీరియస్‌గా వున్న తండ్రి ఫేస్ చూసి సాయంత్రం తను వెళ్లాల్సిన చిరంజీవి సినిమాకు



డబ్బులు ఎలా అడగాలో సంశయంలో పడ్డాడు.

రాధ తండ్రీ, కొడుకులకు భోజనాలు వడ్డించింది. "ఛీ! ఛీ!! ఇదేం కూర? ఇదసలు కూరేనా? ఇన్నేళ్ళు వచ్చినయ్యి. ఇంతవరకు కూర వండడం చేతగాదు ఛీ! ఛీ!!" అంటూ గుత్తి వంకాయ కూరను ప్లేటుతో సహా గిరవాటు వేసేశాడు.

రాధకు మండుకొచ్చింది. అయినా ఏమీ అన్లేదు. మౌనంగా ఆ కూర ప్లేటునూ ఆ ప్లేస్‌మాట్లీన్ చేసింది. "హమ్మయ్య ఇప్పుడు మనస్సు ఎంతో తేలికగా వుంది తనకు" గట్టిగా ఊపిరి పీల్చి వదిలాడు రిలాక్స్‌గా వుంది. ఆఫీసర్ అప్లాచారి మీద కసి తీర్చుకున్నాననిపించింది గోపాలరావ్‌కు.

ఆఫీసుకు బయలుదేరుతుండగా, అప్పుడు విని పించింది "వెధవా, వెధవన్నర వెధవా" ధారాళంగా తిట్లు, దెబ్బలు, బాబిగాడి ఏడుపు. విన్లేక గోపాలరావ్ గబగబా బయటకు నడిచాడు.

—ఎం.సి.హెచ్. పూర్ణచంద్రరావు

29-12-89 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక